క్లుప్తంగా

క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలి



సర్వాయిపల్లెలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ 1 రఘురామిరెడ్డి

ఉయ్యాలవాడ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరు కావాలని ఎంఈఓ 1 రఘురామిరెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండలంలోని సర్వాయిపల్లె గ్రామంలో ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు, బ్యాగులు, షూస్, యూనిఫాం దుస్తులను ఉచితంగా అందజేస్తుందన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను చక్కగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు వైద్య విజ్ఞాన సదస్సు



పోస్టర్లు విడుదల చేస్తున్న వైద్యులు

గోస్పాడు: పట్టణంలో ఈనెల 27వ తేదీన రాయలసీమ స్థాయి వైద్య విజ్ఞానిక సదస్సు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక చైర్మన్ డాక్టర్ రవికృష్ణ తెలిపారు. పట్టణంలోనీ మధుమణి సమావేశ భవనంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు నందకిశోర్ ఆధ్వర్యంలో పట్టణంలోని సౌజన్య కన్వెన్షన్ సెంటర్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాయలసీమలోని ఉమ్మడి కర్నూలు అనంతపురం, కడప చిత్తూరుతో పాటు నెల్లూరు జిల్లాల నుంచి దాదాపుగా 700 మంది వైద్యులు సదస్సులో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు మధుసూదన్ రావు, విజయ భాస్కర్ రెడ్డి, ఫనిల్ కుమార్, మధుసూదన్ రెడ్డి, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

29న ఉద్యోగ మేళా

నంద్యాల(అర్బన్): స్థానిక జ్ఞానాపురం వద్ద ఉన్న నేషనల్ ఐటీఐ కాలేజీలో ఈనెల 29న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సోమశివారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యూషన్ మైక్రో ఫైనాన్స్, శివరాం ఫైనాన్స్, సుజల పైప్స్ కంపెనీల ఆధ్వర్యంలో రిలేషన్ షిప్ ఆఫీసర్ (ఇంటర్ ప్లస్ ఎల్ఎల్ఆర్ లైసెన్స్), సేల్స్ ఎగ్జిక్యూటివ్ (ఎనీ డిగ్రీ), మిషన్ ఆపరేటర్ (పది, ఇంటర్, ఐటీఐ), హెల్పర్, ప్రొడక్షన్లకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్ల నుంచి 35ఏళ్ల వయస్సు మధ్య ఉన్న వారు అర్హులని, అభ్యర్థులు ధ్రువ పత్రాలు, ఫొటోలు తీసుకొని ఇందులో పాల్గొనాలన్నారు.

గురుకుల పాఠశాలను వేరే భవనంలోకి మార్చండి



తనిఖీ చేస్తున్న జడ్జి అమ్మన్నరాజ

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలను శుక్రవారం జిల్లా జడ్జి అమ్మన్నరాజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్, రెవెన్యూ అధికారులతో కలసి తనిఖీ చేసిన ఆయన శిథిలావస్థలో ఉన్న భవనం, పగుల్లిచ్చిన గోడలను చూసి అసహనం వ్యక్తం చేశారు. వెంటనే వేరే భవనంలోకి స్కూల్‌ను మార్చాలని అంతవరకు విద్యార్థులకు వారం రోజులు సెలవు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ జయప్ప, ప్రిన్సిపాల్ గుర్రప్ప ఉన్నారు

28న బీజేపీ అధ్యక్షుడు రాక

నంద్యాల(వ్యవసాయం): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈనెల 28వ తేదీన నంద్యాలకు వస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు, రాష్ట్ర కార్యదర్శి ఖాదరబాద్ నర్సింగ రావు, కొట్టె చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ పార్టీ బలోపేతం, కేంద్ర పథకాల ప్రచారమే లక్ష్యంగా ఆయన జిల్లాకు వస్తున్నట్లు తెలిపారు. స్థానిక చామ కాల్వ వద్ద ఉన్న ఓ ఫంక్షన్ హాలులో ముఖ్య కార్యకర్తల సమావేశం జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమానికి జిల్లా, పట్టణ, మండల కమిటీ నాయకులు, క్రియాశీలక సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా కలీముల్లా



నంద్యాల(అర్బన్): పీఆర్‌టీయూ నంద్యాల మండల అధ్యక్షుడిగా కలీముల్లా, కార్యదర్శిగా ప్రేమ్ కుమార్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కార్యాలయంలో జరిగిన ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామపక్కీర్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరరెడ్డి మాట్లాడుతూ బదిలీ అయిన వారి పొజిషన్ ఐడీలు త్వరగా పంపించి జీతాలు వచ్చే విధంగా అధ్యక్ష కార్యదర్శులు పోరాటం సాగించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయరావు, సమయూన్, జాఫర్ హుస్సేన్, లక్ష్మీకాంతరెడ్డి, సుభాన్ పాల్గొన్నారు.

బాబు మాట మీద నిలబడరు



బాబూ ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న గంగుల బిజేంద్రారెడ్డి



కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, స్థానికులు

- ఓట్ల కోసం నమ్మించి మోసం చేశారు
- ఏడాది గడిచినా ప్రజలకు చేసింది శూన్యం
- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

రుద్రవరం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడూ మాట మీద నిలబడరు.. చెప్పింది చేయరని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి విమర్శించారు. ఇందుకు ఆయన ఎన్నికల హామీలే నిదర్శనమని చెప్పారు. మండలంలోని ఆలమూరు, మందలూరు గ్రామాల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికి వెళ్లి ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు..వాటి అమలులో వైఫల్యాలను వివరించారు. తర్వాత వైఎస్సార్‌సీపీ శ్రేణులు, గ్రామ ప్రజలకు సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల ముందు అధికారం కోసం చంద్రబాబు సూపర్ సిక్స్‌తో పాటు అనేక హామీలు ఇచ్చారన్నారు. ఏడాది గడిచినా వాటిని పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై ప్రశ్నించే వారిపై కేసులు, వేధింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల ఆడబిడ్డ నిధి అమలు చేయాలంటే ఆంధ్రను అమ్మాల్సి వస్తుందని చెప్పారని..కూటమి నాయకులకు ఈవిషయం ముందు తెలియదా అని ప్రశ్నించారు. లేదంటే ఓట్ల కోసమే అలాంటి హామీలు ఇచ్చినట్లు భావించాల్సి వస్తుందన్నారు. ఏడాదిగా కూటమి సర్కారు ఒక్క ఉద్యోగం భర్తీ చేయలేదన్నారు. ఎన్నికల ముందు ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు ఇస్తామని చంద్రబాబు ప్రకటించి ఇప్పుడు నోరు మెదపడం లేదన్నారు. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. అలాగే 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్నారు కనీసం మీకు ఒక్క సిలిండర్‌కైనా సొమ్ము అందిందా అని ప్రజలను అడిగారు. 50 ఏళ్లు దాటిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇప్పటి వరకు పింఛన్ ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మెన్ గంధం రాఘవరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రసాద రెడ్డి, గ్రామ నాయకులు పాణ్యం చంద్ర, నాగేష్, జయరాముడు, శూలం ప్రభాకర్, రహీం, ఎంపీటీసీ శంకరెడ్డి, శ్రీనివాసరెడ్డి, గోపాల్ రెడ్డి, హరినారాయణ, ఎంపీపీ బాలస్వామి, గుండా నరసింహయ్య, బాలయ్య, తాలూకా యువజన అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మందలూరులో మహిళకు బాబు మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే

అన్నదాత సుఖీభవ వాయిదాలకే పరిమితం

అన్నదాత సుఖీభవ పథకం అమలు వాయిదాలకే పరిమితమైందని మాజీ ఎమ్మెల్యే అన్నారు. ఎన్నికల ముందు ఏటా రైతులకు రూ. 20 వేలు ఇస్తామని ప్రకటించి ఇప్పుడు కేంద్రం ఇచ్చినప్పుడు తాము ఇస్తామనడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. నాడు ఓట్ల కోసం అబద్ధాలు చెప్పారన్నారు. ప్రస్తుతం రైతులు పంట పెట్టుబడికి డబ్బులు లేక అవస్థలు పడుతున్నారన్నారు. వారిని ఆదుకోవడంలో కూటమి సర్కారు పూర్తిగా విఫలమైందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా సీజన్‌కు ముందే రైతు భరోసా పథకం కింద రైతన్నలకు సాయం అందేదని గుర్తు చేశారు. దీంతో పాటు విత్తనాలు, ఎరువులు, యంత్రాలు తదితరవి సబ్సిడీపై పంపిణీ జరిగేదన్నారు. ఇప్పుడు కూటమి సర్కారు వాటిని అటకెక్కించిందన్నారు. నమ్మించి మోసం చేసిన కూటమి నాయకులకు రానున్న స్థానిక ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

పచ్చదనం పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందాం



మొక్క నాటుతున్న చైర్‌పర్సన్ మాబున్నిసా

నంద్యాల(న్యూటౌన్): విరివిగా మొక్కలు నాటి పెంచదనం పెంచి తద్వారా పర్యావరణాన్ని కాపాడుకుందామని జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు జనాబ్ మహమ్మద్ రఫీక్, నంద్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా పేర్కొన్నారు. చిన్నారులతో పదిలక్షలు మొక్కలు నాటే జాతీయ ఉద్యమాన్ని శుక్రవారం నంద్యాల ప్రభుత్వ ఉర్దూ కళాశాలలో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టిలో చేతులు.. హృదయంలో దేశం అనే నినాదంతో మొక్కలు నాటించి విద్యార్థుల్లో దేశ భక్తి నింపుతున్నట్లు తెలిపారు. మంచి ఆరోగ్యానికి గాలి ఎలా ఉపయోగపడుతుందో విద్యార్థులకు వివరించారు. అనంతరం చిన్నారులు ఆలపించిన గీతాలు, మొక్కలు, వృక్ష సంపదపై నిర్వహించిన వ్యాసం, వక్తృత్వ పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ నంద్యాల అధ్యక్షుడు అబ్దుల్‌సమ్మద్, ఐటా ఉపాధ్యాయ నాయకులు హఫీజ్ జమా, కళాశాల ప్రిన్సిపాల్ కరీముల్లా పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

నంద్యాల(అర్బన్): నంద్యాల మండలం హైస్కూల్ కొట్టాల గ్రామానికి చెందిన ప్రశాంతి అనే యువతి అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 11న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆ యువతి తిరిగి ఇంటికి రాలేదు. అదృశ్యంపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాధ్యతగా పనిచేయాలి



రికార్డులను పరిశీలిస్తున్న జేసీ

నంద్యాల(అర్బన్): ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా భూమి హక్కుల పరిరక్షణను బాధ్యతగా చేపట్టాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నంద్యాల మండలం గుంతనాల గ్రామంలోని సర్వే నెంబర్లు 14, 17లోని భూముల మార్కెట్ విలువలలో గల వ్యత్యాసాలను సరి చేయాలని కొందరు రైతులు వినతి అందజేశారు. దీనిపై శుక్రవారం మండల తహసీల్దార్‌తో కలిసి అందుకు సంబంధించిన రికార్డులను జేసీ పరిశీలించారు. మార్కెట్ విలువల సవరణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లార్వా దశలోనే దోమల నివారణ



ఇళ్లలో నిలిచిన నీటిలో లార్వాను పరిశీలిస్తున్న అధికారులు

నంద్యాల(అర్బన్): దోమలను లార్వా దశలోనే అంతం చేయాలని జిల్లా మలేరియా నివారణ అధికారి చంద్రశేఖర్‌రావు తెలిపారు. డ్రై డే–ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నంద్యాల మండలం కానాల గ్రామంలో ఆయన వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లార్వా దశ నుంచి ఏడు రోజుల్లో దోమ తయారు అవుతుందన్నారు. డెంగీ దోమగా వృద్ధి చెంది మనిషి శరీరంలో ప్లేట్‌లెట్స్ తగ్గి ప్రాణాపాయం జరిగే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సామాజిక పరిశుభ్రతకు ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల హెల్త్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం రత్నమ్మ, ఆశా వర్కర్ రోజా, హెల్త్ సిబ్బంది పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడలో తగ్గిన ఖరీఫ్ సాగు



అల్లూరు గ్రామ సమీపంలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట

ఉయ్యాలవాడ: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మండలంలో సాధారణ సాగు విస్తీర్ణం 2,975 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 316 హెక్టార్లలో రైతులు పంటలు సాగు చేశారు. మొక్కజొన్న 237 హెక్టార్లు, మినుము 44, పత్తి 21, సోయాబీన్ 7, పెసర 7 హెక్టార్లలో పంటలు వేశారు. ఎప్పుడూ లేని విధంగా ఈసారి సాగు విస్తీర్ణం తగ్గింది. ఇందుకు మండలంలో పదునైన వర్షాలు కురవకపోవడమే కారణంగా తెలుస్తోంది. మే నెలలో సాధారణ వర్షపాతం 36 ఎమ్ఎమ్ కాగా 156 ఎమ్ఎమ్ వర్షం కురిసింది. జూన్‌లో సాధారణ వర్షపాతం 63 ఎమ్ఎమ్ కాగా 56.4 ఎమ్ఎమ్, జూలైలో 119 ఎమ్ఎమ్‌కు గాను ఇప్పటి వరకు 73 ఎమ్ఎమ్ వర్షపాతం నమోదైంది. మండలంలో ఎక్కువ శాతం మెట్ట భూములు కావడంతో రైతులు వర్షంపై ఆధారపడి ఉన్నారు. పదునైన వర్షం కురిస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

పంట బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రస్తుతం ఖరీఫ్‌లో సాగు చేసిన రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకుని పంటల బీమా చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న ఎకరాకు రైతు వాటా రూ. 660, పత్తి రూ. 1600, మినుము రూ. 38 చొప్పున బ్యాంకు ద్వారాగాని, కిసాన్ క్రెడిట్ కార్డు పొందిన రైతులు సీఎస్‌సీ కేంద్రాలలో కూడా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. బీమాకు ఈ నెల 31వ తేదీ వరకు గడువు ఉందని స్పష్టం చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): మండలంలోని రాయమాల్పురం గ్రామం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెలుతున్న ఉపాధ్యాయులు రమణ యాదవ్, మాధవీలను శుక్రవారం సత్కరించారు. పాఠశాల హెచ్ఎం లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నంద్యాల మండల ఎంపీపీ ప్రభాకర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చక్కగా విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓబయ్య, అనంతలక్ష్మి, అన్నపూర్ణాదేవి, సత్యవతమ్మ, పూల శీను, శేషు తదితరులు పాల్గొన్నారు.

28న ఖాళీ స్థలం బహిరంగ వేలం పాట

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీకాళికాంబ చంద్రశేఖర స్వామి దేవస్థానం, బ్రహ్మనందీశ్వరస్వామి దేవస్థానం, గుడిపాటిగడ్డలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయాల ఖాళీ స్థలాల లీజ్‌కు ఈనెల 28 బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వేలం పాట గుడిపాటిగడ్డలోని మల్లికార్జునస్వామి దేవస్థానంలో జరుగుతుందని ప్రతి పాట దారుడు రూ.5వేలు డిపాజిట్ చేసి వేలాల్లో పాల్గొనాలన్నారు. హెచ్చు వేలం పాట పాడిన వారికి మూడు సంవత్సరాలకు గాను లీజు ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఈఓ లక్ష్మీనారాయణ సెల్ : 94938 46591కు సంప్రదించాలన్నారు.

అమ్మవారికి శ్రావణ మాస పూజలు



అలంకరణలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఆలయాల్లో శుక్రవారం శ్రావణమాస పూజలు ప్రారంభమయ్యాయి. స్థానిక కాళికాంబదేవస్థానంలోని శ్రీజగజ్జననీ ఆలయంలో అమ్మవారికి తెల్లవారుజామునే పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. తర్వా అమ్మవారిని ప్రత్యేకంగా పట్టువస్త్రాలతో అలంకరించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం శ్రీకాళీ మాత సేవా సమాజ్ ఆధ్వర్యంలో పల్లకీ సేవ నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయంలో గోవుకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆరవేటి వాసు, ఈఓ లక్ష్మీనారాయణ, అర్చకులు రాఘవేంద్ర, సుబ్బాచారి, విజయ్‌కుమార్, లక్ష్మీదేవి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్

నంద్యాల: జిల్లాలో నాటుసారా నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాను నాటుసారా రహితంగా మార్చేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీ, ఎక్సైజ్ శాఖలోని అధికారులతో కలిసి ఏ గ్రామంలోనూ నాటుసారా తయారీ, విక్రయాలు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో 129 గ్రామాల్లో నాటుసారా ఉండగా ఇప్పటికే 70 గ్రామాల్లో పూర్తిగా నిర్మూలించామన్నారు. 48వేల నాటుసారా బెల్లం ఊటను ధ్వంసం చేయడంతో పాటు 20 వాహనాలు సీజ్ చేశామని, 450 మందిపై బైండోవర్ కేసు నమోదు చేశామన్నారు. పాణ్యంకు చెందిన రాజు అనే వ్యక్తి ఎన్ని సార్లు పట్టుబడినా పదే పదే నాటుసారా వ్యాపారం చేస్తుండటంతో జిల్లా కలెక్టర్ అనుమతి మేరకు అతనిపై పీడీయాక్ట్ కేసు నమోదు చేశామన్నారు. జిల్లాలో ఎవరైనా నాటుసారా అమ్మినా, కాసినా వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐలు కృష్ణమూర్తి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఘనంగా ఐవీఎఫ్ దినోత్సవం



మాట్లాడుతున్న డాక్టర్ అరుణకుమారి

గోస్పాడు: సంతానలేమికి ఐవీఎఫ్ గొప్ప వరమని స్త్రీ ప్రసూతి వ్యాధి నిపుణురాలు, సంతాన సాఫల్య వైద్యురాలు డాక్టర్ అరుణకుమారి అన్నారు. నంద్యాల పట్టణంలోని నెరవాటి హాస్పిటల్‌లో శుక్రవారం ప్రపంచ ఐవీఎఫ్ (టెస్ట్ ట్యూబ్ బేబీ) దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐఎంఏ నంద్యాల మిషన్ పింక్ హెల్త్ గౌరవ అధ్యక్షురాలు డాక్టర్ నాగమణి అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డాక్టర్ల ఆధ్వర్యంలో కేకును కట్ చేసి పంపిణీ చేశారు. డాక్టర్లు రవికృష్ణ, నెరవాటి వినోద్ కుమార్, కల్పన, నర్మద, నాగరేఖ, మాధవి, రజనీ, సునీత, అరిఫాబాను, తనూజ, ఫాతిమా, రాధిక, సుసుమ పాల్గొన్నారు.

నరక యాతన!

- పల్లెల్లో అధ్వానంగా వీధి రోడ్లు
- అవస్థలు పడుతున్న జనం
- యర్రగుంట్ల మేజర్ పంచాయతీలో పరిస్థితి మరీ దారుణం
- చోద్యం చూస్తున్న అధికారులు



యర్రగుంట్లలోని 4వ వార్డులో బురదమయంగా ఉన్న రోడ్డును చూపుతున్న ప్రజలు



యర్రగుంట్లలో 6వ వార్డులోని రోడ్డు ఇలా..

శిరివెళ్ల: వర్షాకాలాల్లో గ్రామీణ ప్రాంతాల వీధి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. వాటిలో నడవడానికి ప్రజలు నరకయాతన పడుతున్నారు. రాత్రి వేళల్లో పిల్లలు, వృద్ధులు, వికలాంగులు పరిస్థితి మరింత దారుణంగా మారింది. అవసరాల కోసం బయట అడుగు వేయలేని దుస్థితి. దశాబ్దాలుగా ప్రజలు సిమెంట్ రోడ్ల వేయమని మొర పెట్టుకుంటున్నా ఫలితం లేదు. మండలంలోని యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. ఈ పంచాయతీలోని 4 వార్డులో ఎస్సీ బాలురు హాస్టల్, ఉన్నత పాఠశాలకు వెళ్లే రోడ్లు ఉన్నాయి. వందలాది విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు బురదమయంగా మారిన రోడ్డుపై వెళ్లాల్సి వస్తుంది. అలాగే రైతులు కూడా రోడ్డుపైనే పొలాలకు వెళ్తున్నారు. బడుగు, బలహీన వర్గాలు నివసించే వీధులను సిమెంట్ రోడ్లుగా మార్చాలన్న ఆలోచన నాయకులు, అధికారులకు లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వనికినిదిన్నె రస్తాలో బాబనయ్య ఏరియాలో ఉన్న 3 వీధి రోడ్లు కూడా బురదమయంగా మారింది. ఆయా రోడ్లపై 3 నెలల పాటు నీరు నిలిచి ఉంటుందని..అధికారులు మాత్రం వాటి బాగుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రజలు వాపోతున్నారు. ఓట్లప్పుడే మా వీధులకు వస్తారని మండిపడుతున్నారు.

ప్రకటనలకే పరిమితమైన ఆర్థిక సంఘం నిధులు



ఉన్నత పాఠశాల, హాస్టల్‌కెళ్లే దారి

కూటమి ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలకు నిధులు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయి. నిధులు మంజూరు కాక గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీకి ఏటా ఆర్థిక సంఘం నిధులు రూ. 55 లక్షలు దాకా మంజూరవుతుంటాయి. ప్రతి ఏటా ఏప్రియల్ ఒక విడత, ఆక్టోబర్‌లో రెండవ విడత మంజూరవుతుంటాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తెలి రెండు నెలలో 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయి. గతేడాది డిశంబర్ నెలలో నిధులు మంజూరయినట్లు ప్రకటనలు వెలుబడాయి. ఆ నిధులు నేటికి జమ కాలేదు. మళ్లీ 2025–26 ఆర్థిక సంవత్సరానికి చెందిన మొదటి విడత ఏప్రియల్ నెలలో మంజూరు కావాలి. అవి కూడా మంజూరు కాలేదు. ఈ అర్థిక సంవత్సరం అక్టోబర్ నెలలో రెండవ విడత మంజూరు కావాల్సి ఉంది. ఇప్పటికి పంచాయతీకి రెండు విడత నిధుల కింద రూ. 55 లక్షలు దాకా మంజూరు కావాల్సి ఉండగా పైసా కూడ రాలేదన్నారు. నిధులు లేకే రోడ్లు వేయలేకపోతున్నామని సర్పంచులు వెల్లడించారు.

మహిళా దొంగలు అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ కల్పనా కుమారి

నంద్యాల: రైలు ప్రయాణికులను ఏమార్చి చోరీలకు పాల్పడిన ఇద్దరు మహిళా దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం రైల్వే ఎస్ఐ కల్పనా కుమారి తెలిపిన వివరాల మేరకు.. పెద్దకొట్టాల గ్రామానికి చెందిన దూదేకుల మనీషా, దూదేకుల బాబావలి దంపతులు ఈనెల 20వ తేదీన హైదరాబాద్‌కు వెళ్లేందుకు స్టేషన్‌కు చేరుకున్నారు. గుంటూరు–ఔరంగబాద్ రైలు ఎక్కే సమయంలో ఇద్దరు మహిళలు వారి బ్యాగ్ నుంచి 15 గ్రాముల బంగారు నెక్లెస్‌ను అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన పోలమ్మ, నిర్మల చోరీకి పాల్పడినట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు ఇద్దరి మహిళలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

విద్యార్థినులకు శక్తి యాప్‌పై అవగాహన



శక్తి యాప్ గురించి వివరిస్తున్న సీఐ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని బొమ్మలసత్రంలో ఉన్న డాక్టర్ రామలింగారెడ్డి బాలికల జూనియర్ కళాశాలలో మహిళా పోలీసు స్టేషన్ సీఐ జయరాం విద్యార్థినులకు శక్తియాప్‌పై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు జరిగినప్పుడు 1930 నెంబరును ఉపయోగించుకోవాలన్నారు. ఈ నంబరు ఆపద సమయంలో రక్షణగా నిలుస్తుందన్నారు. ర్యాగింగ్‌లు, యూవ్‌టీజింగ్‌లపై అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు వారియర్స్ ద్వారా పోలీసులకు సమాచారం అందించాలన్నా రు. కొంత మంది పిల్లలు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ కొరకు ముందుకు రావడంతో వారికి శిక్షణ ఇచ్చేందుకు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు సీఐ చెప్పారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.